# వెన్నెలతో...

ఎస్. శేషగిరి

గేటు బయట కారు హారన్ మోగింది.

నా గుండె ఝుల్లుమంది. హారన్ శబ్దం విన్నందుకు కాదు. విక్రమ్ వచ్చినందుకు.

అంటే వాడు నిజంగానే వచ్చాడన్నమాట. వాడు రోజూ రావడం వేరు, ఈ రోజు రావడం వేరు.

వచ్చినందుకు సంతోషించాలో... విచారపడాలో తెలియని డైలమాలో ఉన్నాను...

ఇంతలో వాడు మళ్లీ హారన్ మోగించాడు... త్వరగా రమ్మంటూ...

"ఆ... వస్తున్నారా!" అంటూ గబగబా తలుపుతీసి బయటకొచ్చి, లాక్‌చేసి వెళ్లి కార్లో కూర్చున్నాను.

"ఏరా... ఏంటింత ఆలస్యం? అక్కడకు వెళ్లకముందే ఊహల్లో తేలిపోతున్నావా... ఏంటి?" అన్నాడు విక్రమ్ చిన్నగా నవ్వుతూ, కారు స్టార్ట్‌చేసి ముందుకు పోనిస్తూ.

"అబ్బే... అదేంలేదురా..." అన్నాను ఏమనాలో తెలియక చిన్నగా నవ్వుతూ.

మా ఇద్దరిమధ్యా మౌనం చేరి... మాటలను బంధించింది.

కారు జోరుగా పరిగెడుతోంది. నా ఆలోచనలు అంతకంటే వేగంగా పయనిస్తున్నాయి.

'మొదటిసారి... జీవితంలో అటువంటి చోటుకెళ్లడం. ఎలా ఉంటుందో ఆ అనుభవం?' అని నా మనసు తెగ ఉవ్విళ్లూరుతోంది.

ఇంతవరకూ స్త్రీ స్పర్శ ఎరుగని నేను మరి కొంతసేపట్లో... ఒక స్త్రీతో రాత్రంతా గడపబోతున్నాను. ఆ ఊహకే నా నరాలు జివ్వుమంటున్నాయి. అసలే చలికాలం... అందులో వయసులో ఉన్నవాణ్ణి.

కోరికలు గుర్రాలై దారితెలియని గమ్యానికి పయనిస్తుండే వయసులో ఇంతవరకూ నేను వాటికి జాగ్రత్తగా కళ్లెంవేస్తూ వచ్చాను. విక్రమ్ ఆ కళ్లేలను ఇప్పుడు తెంచబోతున్నాడు.

నేనూ, విక్రమ్ ఒక పెద్ద ఎం.ఎన్.సి. కంపెనీలో పనిచేస్తూ హైదరాబాద్ నుంచి ముంబైకి ట్రాన్స్‌ఫరై వచ్చాము రెండేళ్లక్రితం.

ఇద్దరి వయసూ పాతికలోపే. జీతం పాతిక వేలకు పైనే కావడంతో జీవితంలో స్వేచ్ఛకు జీతం తోడైంది. వయసు దారిమళ్లింది వాడి విషయంలో.

నేను అంత అమాయకుడినని కాదు. ఏదో అప్పుడప్పుడూ ఓ బీరు, సినిమాలకే నా సరదాలు పరిమితం తప్ప అంతకంటే అడ్వాన్స్ అవలేదు. అవదలచుకోలేదు.

నాకున్న ఏకైక హాబీ పుస్తకాలు. పుస్తకాలే నా ఫ్రెండ్స్, పుస్తకాలే నా ప్రపంచం.

ఆఫీస్ నుంచి రాగానే మంచి పుస్తకంతో కాలక్షేపం చేస్తాను తప్ప సినిమాలు, పబ్‌లు, క్లబ్బులు అంటూ సమయమూ, డబ్బూ వృథా చేయను.

అలా పుస్తకాలు చదవగా చదవగా ఏంటు


AVM

కో నాకూ రాయాలనిపించి రాయడం మొదలు పెట్టాను. క్రమంగా అవి వివిధ పత్రికల్లో అచ్చ వడం మొదలవడంతో ఏదో తెలియని ఆత్మతృప్తి నన్నావహించేది.

నేనో కథ రాయాలంటే... నా మనసులో ఎక్కడో ఏదో అలజడి రావలసిందే. అలా రేగిన అలజడే నేను రాయబోయే కథకు కావలసిన స్ఫూర్తినిచ్చేది. అందుకే నేనీసారి వేశ్యపై కథ రాయాలని నిర్ణయించుకున్నాను.

నా కథలకొచ్చే పారితోషికంతోపాటు నా కొచ్చే జీతంలో కొంతభాగాన్ని కలిపి దానధర్మా లకు ఉపయోగిస్తూ, నా అవసరాలకు సరిపడా ఉంచుకుని మిగిలిన డబ్బుని నా తల్లిదండ్రులకు పంపిస్తుంటాను.

విక్రమ్ నాకు పూర్తిగా విరుద్ధం. పాతిక వేలు జీతమొచ్చినా రెండోవారమే నా ముందు వందకీ యాభైకీ చెయ్యి చాస్తుంటాడు.

శని ఆదివారాలొస్తే వాడిలోకం వాడిది. క్లబ్బుల్లో మందు, పబ్బుల్లో చిందులు.. ఖరీదైన రెస్టారెంట్లలో విందులు... ఆపై అందమైన అమ్మాయిలతో పొందులు...

"జీవితాన్ని ఎంజాయ్ చెయ్యాలిరా..." అని తరచూ అంటూండేవాడు విక్రమ్.

వాడి లైఫ్‌ని వాడికి నచ్చిన స్టయిల్లో ఎంజా య్ చేస్తే నేను నా లైఫ్‌ని నాకు నచ్చిన స్టయిల్లో ఎంజాయ్ చేస్తుంటాను.

అందమైన అమ్మాయిల గాఢపరిష్వంగం లోని వెచ్చదనం వాడికి సంతృప్తినిస్తే... ముంబై రోడ్లమీద, ఫుట్‌పాత్‌లపై చలికి వణుకుతూ పడు కున్న వారికి బ్లాంకెట్లు కప్పడంలోని వెచ్చదనం నాకు సంతృప్తినిస్తుంది.

ఇలా మా ఇద్దరి అభిప్రాయాలూ వేరైనా మా మధ్య ఉన్న స్నేహమనే వారధి పటిష్టంగానే నిర్మితమైంది.

ఈ మధ్య మా వాళ్లు నాకు పెళ్లి ప్రయత్నా లు మొదలుపెట్టారు. "ఈ అమ్మాయినే చేసుకో వాలి అని షరతులు పెట్టకుండా నీకు ఏ అమ్మా యి నచ్చినా సరే... వెంటనే మూడు ముళ్లూ వేయిస్తాం" అని పట్టుబట్టారు.

అది విన్నప్పట్నుంచీ వీడు ఒకటే నస. "పెళ్లి కి ముందర ఒక్కసారైనా ఆ ముచ్చట తీర్చుకో రా. కాస్త ఎక్స్‌పీరియన్స్ వస్తుందీ..." అంటూ చెవిలో జోరీగలా గోలపెడుతుండేసరికి... నాకూ ఎందుకో వాడి మాటలమీద మొదటిసారి ఇంట్రె స్ట్ కలిగి... ఇంప్రెస్ అయ్యాను. వెంటనే "ఓకే" అన్నాను. పన్లో పనిగా నా కథకి కావలసిన థీమ్ దొరుకుతుందనే ఆశతో...

కారు స్పీడ్ తగ్గింది. విండోలోనుంచి చల్లటి గాలి నా వంటికి తగిలి గిలిగింతలు పెడుతోం ది. 'అబ్బా! ఈ చల్లగాలే ఇంత గిలిగింతలు పెడుతోంటే... ఇక ఆ పిల్లగాలి ఎంత హాయిగా ఉంటుందో?...' అనుకున్నాను మనసులో.

అలా అనుకుంటూండగానే కారు ఒక సందులో ఆగింది. అదో పెద్ద బంగ్లా.

విక్రమ్ చకచకా దిగి లోనికి నడుస్తున్నాడు. బహుశా వాడికది బాగా అలవాటైన దారి కాబోలు.

"ఏరా! కారు దిగవా ఏంటీ? కొత్త పెళ్లి కొడుకులా సిగ్గుపడుతున్నావు? పద పద" వెను దిరిగి నన్ను ఉద్దేశించి అంటూ మళ్లీ లోనికి నడకదీసాడు.

నేను నెమ్మదిగా వాడి వెనకే నడుచుకుంటూ వాడిని ఫాలో అయ్యాను.

లోనికి అడుగు పెడుతూంటే నా కాళ్లు సన్న

గా వణకడం నాకు తెలుస్తోంది. అది భయం వల్లో లేక నేను పొందబోయే అనుభవం తాలూకు థ్రిల్‌ని తలచుకునో నాకు స్పష్టంగా తెలియడంలేదు.

అచ్చం సినిమాల్లో చూసినట్లే ఉందా వాతావరణం. అసలు ఇటువంటి చోట్లుంటాయని వినడం, సినిమాల్లో చూడడమే గాని, నిజంగా నేను డైరెక్ట్‌గా వస్తాను అనుకోలేదు కలలోనైనా.

విక్రమ్ ఎవరో ఒక నడివయసు స్త్రీతో మాట్లాడుతున్నాడు. ఆమె వయసు దాదాపు నలభై అయిదుంటుంది. ఇంకా శరీరపు బిగువులు సడలలేదు. నోట్లో జర్దాకిళ్లీ, వంటినిండా నగలూ చెప్పకనే చెప్తున్నాయి ఆమె అమ్మాయిల ఏజంటని.

"క్యా విక్రమ్! నయా చోకరేకో లాయేహ? ముర్గా బహుత్ అచ్ఛాహై. బోలో కైసీ మూర్గ్ చాహియే?" అంది చిన్నగా కన్నుకొట్టి.

"ఏరా చెప్పు... నీకెలాంటి పిల్లకావాలో?" అన్నాడు నన్ను చూసి నవ్వుతూ విక్రమ్.

ఇంతలో... "యే కింతి... శాంతి... శైలు... ఫల్గా..." అంటూ ఓ అరుపరిచింది బండ గొంతుకతో...

ఆ పిలుపు విన్న వెంటనే సీతాకోకచిలుకల్లాంటి అందమైన అమ్మాయిలంతా బరబరా మంటూ వచ్చి, వరుసగా నిల్చొన్నారు సంతలో బేరానికి పెట్టిన పశువుల్లా.

"బోల్‌చోక్రా? కౌన్‌చాహియే?" అంది ఆమె నన్ను సూటిగా చూస్తూ.

నేను నెమ్మదిగా తలెత్తి అందరినీ పరీక్షగా చూసాను.

నేను కాసేపలా చూస్తుండగానే తనే అంది... "అరే చోక్రా ఇన్ మేసే కోయీ పసందాయా?" అంది నోట్లోని జర్దాకిళ్లీ పక్కనున్న తొట్టిలోకి ఉమ్ముతూ.

"ఉహూ" అన్నాను తల అడ్డంగా ఊపుతూ.

"తో ఏక్ కామ్‌కరే... ఏక్ అంద్రా మూర్గ్‌హై తెరేలియే... తూ ఉస్ సమజ్ కర్లే..." అంటూ "ఏయ్" వాహినీ... వాహినీ... అంటూ పిలిచింది.

జింక పిల్లలా పరుగు పరుగున పరిగెత్తుకొచ్చిన ఆ పిల్ల వంక పరీక్షగా చూశాను. కుందనం బొమ్మలా ఉంది. అందంగా... అమాయకంగా... ఉన్న ఆమె కళ్లు నన్నెంతగానో ఆకర్షించాయి.

నేనామె వైపు పరీక్షగా చూడ్డం గమనించిన ఆవిడ "క్యాఛక్షకరి పసందాయా?" అడిగింది పెద్దగా నవ్వుతూ.

నేను చిన్నగా నవ్వాను నచ్చిందని అన్నట్టుగా.

"చల్ చల్ మజా కర్‌లే" అంటూ పైనున్న రూమ్ చూపించింది నాకు.

"ఆల్ ది బెస్ట్ రా..." అన్నాడు మావాడు కన్ను కొట్టి నవ్వుతూ.

ఆమె ముందుగా నడుస్తుంటే నేనామెని అనుసరించాను.

గది తలుపు తెరిచి లోనికి అడుగుపెట్టాను. విశాలమైన గది. గోడలకు వెలసిపోయిన సున్నం.

ఓ డబుల్ కాట్ మంచం, దాని పక్కనే ఓ అటాచ్‌డ్ బాత్‌రూమ్ వున్నాయా గదిలో.

నాలోని రచయిత ఆ పరిసరాలని ఓ కంట గమనిస్తున్నాడు.

అప్పటికే ఆ అమ్మాయి నాకోసమై ఎదురు

చూస్తూ మంచంపై కూర్చునుంది.

ఆమెనెలా పలకరించాలో... ఏమని పలక రించాలో అర్థం కాలేదు. క్షణాలు నిమిషాలై గడిచి పోతున్నాయా గదిలో.

"ఆప్ కా నామ్?" అన్నాను కాస్త గొంతు సవరించి... అంతకంటే ఏమడగాలో, సంభాషణ ఎలా ప్రారంభించాలో తెలీక.

"నాపేరు వాహిని"! అంది అచ్చమైన తెలుగులో కోయిల కూసినట్లుగా.

"అంటే మీరు తెలుగువారేనా? మీదే ఊరు?" చకచకా ప్రశ్నల వర్షం కురిపించాను.

ఆమె ఏమీ మాట్లాడలేదు. మౌనంగా శూన్యంలోకి చూస్తుండిపోయింది.

"మిమ్మల్నే... మీదేఊరు?" అన్నాను ఈ సారి రెట్టించిన ఉత్సాహంతో. ఆమె గురించి, ఆమె గతం గురించీ రచయితగా తెలుసుకోవాలనే ఆతృతతో.

ఆమె ఆశ్చర్యంగా నావైపు చూసింది. ఇంత వరకూ తన శరీరంపై ఎప్పుడెప్పుడు వాలిపోదామా, తననెప్పుడు కోరికతో కసిగా నలిపేద్దామా అనే ఆతృత, ఉత్సాహం ఉన్న వాళ్లనే చూసింది కానీ తన గురించి, తన గతం గురించీ తెలుసుకోవాలనుకుని ఉబలాటపడుతున్న మొదటి వ్యక్తిని నన్నే చూసి వుంటుంది.

ఆమె గతం తాలూకు జ్ఞాపకాలను తవ్వినందుకు హృదయం కరిగి... కళ్లు వర్షించడం మొదలెట్టాయి.

"మాది తూర్పు గోదావరి జిల్లాలోని చిన్న పల్లెటూరు.".... అంటూ చెప్పడం ప్రారంభించింది... "మా నాన్నకు రెండెకరాల పొలం ఉండేది. గత నాలుగైదేళ్లుగా వర్షాలు లేకపోవడంతో తీవ్ర కరువు దాపురించింది. మా నాన్న అప్పులు తీర్చలేక సంసారాన్ని నడపలేక విధిలేని పరిస్థితిలో ఆత్మహత్య చేసుకున్నాడు – మమ్మల్ని వీధిలోకి విసిరేసి. నాకు నా మీద ఆధారపడ్డ తల్లి, ఓ తమ్ముడు, ఓ చెల్లీ ఉన్నారు."

ఇంటర్ చదివిన నాకు ముంబైలో మంచి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మా ఊర్లోని ఓ పెద్దమనిషి నన్ను తీసుకొచ్చి ఇక్కడ పడేసాడు. తరువాత తెలిసింది నన్నతడు 'అమ్మేసాడు' అనే సంగతి... అంటూ ఏడుస్తూ చెప్పడం ఆపింది.

"ఆ ఆంటీ చెప్పిన మాట విననందుకు మొదట్లో నన్ను తిట్టేది... తరువాత కొట్టేది... ఆ తరువాత వాతలు కూడా పెట్టేది..." అంటూ చీరను లాగి పారేసింది గబగబా. ఆమె వీపు పైన, మెడ మీద, భుజాల మీద కనిపిస్తున్న కాలిన గుర్తులు ఆమె చెప్పినవన్నీ వాస్తవాలే అని చెప్పక చెప్పాయి.

"అయినా... ఇవన్నీ మీకెందుకు లెండి... మీరు డబ్బులిచ్చారు... కోరికతో వచ్చారు.... మీ కోరిక తీర్చకపోతే... నాకీ పూట తిండి కూడా పెట్టదు ఆంటీ" అంది భయంగా. మంచం మీద వెల్లికిలా పడుకుని కళ్లు మూసుకుంది మనసు చంపుకుంటూ.

నాకెందుకో ఆమె మాటలు కొరడాల్లా చెళ్లున తగిలాయి. ఆమె ఈ సంస్కృతికి ఇంకా అలవాటుపడలేదన్న సంగతి ఆమె మాటల ద్వారా అర్థమైంది.

కాదూ కూడదూ అని మొండికేస్తే... ఆ ఆంటీ మళ్లీ ఏం చేస్తుందో అని భయంతో... కాలే కడుపుతో భగభగ మండే ఆకలికి భయపడే ఆమె ఈ విధంగా మాట్లాడగల్గిందని అర్థమైంది నాకు.

'రండి. మీ పని మీరు చేసుకుపోండి'... అంది నాకెదురుగా నిల్చుని తలవంచుకుని.

ఆమె వంటి మీద చీర కూడా లేకపోవడం తో తెల్లని ఆమె శరీరం... ఆకర్షణీయంగా కనిపిస్తోంది.

ఎత్తయిన ఆమె వక్షసంపద వేరొకర్నయితే ఇట్టే ఆకర్షించేదే. కానీ నాకు మటుకు ఆ ఎత్తయిన ఎదలచాటున దాగున్న లోతైన బాధ కనిపించింది.

పల్చని ఆమె పొట్టపై ఉన్న అందం కాక ఆ పొట్టలో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి నాలోని రచయితకు.

కోరికతో నిండినట్టుగా కనిపిస్తున్న ఆ కళ్లలో... భయం కనిపిస్తోంది... ఆమెలో నాకిప్పుడు భోగవస్తువు కనిపించడంలేదు.

పట్టెడు భోజనం కోసం బలవంతాన మోసగించబడ్డ, బజార్న పడ్డ ఓ నిస్సహాయురాలు కనిపించిందామెలో.

వెంటనే లేచి కిందపడ్డ ఆమె చీర తీసి ఆమెపై కప్పి... పర్సులో ఉన్న డబ్బంతా తీసి ఆమె చేతిలో పెట్టి... 'మీ మీద ఓ కథ రాయాలనుకుంటున్నాను..' అన్నాను... నెమ్మదిగా. నాక్కావాల్సిన కథకు అసలైన నిజమైన థీమ్ దొరికిందని తెలిసి.

ఆమె నవ్వింది... పెద్దగా నవ్వింది... పడీ పడీ నవ్వింది...

"ఏంటీ? నాపై కథ రాస్తారా?!"

"ఇప్పటి వరకూ నామీద... నా శరీరం మీద చాలా మంది కథలు రాశారు. కొందరు చేతులతో... కొందరు పెదాలతో... కొందరు పంటిగాట్లతో... సిగరెట్లతో... పదునైన గోళ్లతో... మదమెక్కిన మగసిరితో... మీరు దేంతో రాస్తారు?" అంది వస్తున్న నవ్వుని బలవంతాన ఆపుకొంటూ.

"మనసుతో" అన్నాను ఆమె కళ్లలోకి సూటిగా చూస్తూ.

"ఏంటి?" ఓ నిమిషం అర్థంకానట్లు చూసింది నావైపు.

"ఇంతవరకూ నువ్వు కడుపునిండా తిండి తిని ఎన్నాళ్లయింది?" అన్నాను లోపలకు పోయిన ఆమె పొట్టని, వాడిపోయిన ఆమె మొహాన్నీ చూసి.

ఆశ్చర్యపోయిందామె నా ప్రశ్నకు. బహుశా తనకే తెలియదేమో ఆ ప్రశ్నకు సమాధానం.

'తెలీదు!' అంది నెమ్మదిగా.

'పోనీ కంటినిండా నిద్రపోయి ఎన్నాళ్లైంది?' వలయాలు కమ్మిన ఆమె కళ్లను సూటిగా చూస్తూ అడిగాను.

'ఊహు.. తెలియదు!!'

ఆమె ఆలోచిస్తూంది... ఆశ్చర్యంగా... నా కేసి చూస్తూ.

ఆమె చూపుల్లో వేలవేల భావాలున్నాయి... ఇంతవరకూ "ఎంతమందితో పడుకున్నావు.. ఎంతమందిని కవ్వించావు?...' అని అడిగే వాళ్లనే చూసుంటుందామె, కానీ... తన అంతరంగాన్ని తెరిచి... తరచి చూస్తున్న మొదటి వ్యక్తిని వింత అనుభూతితో చూస్తోంది.

ఆ విధమైన అనుభూతి చెందడంతో అప్రయత్నంగా. . ఆమె కళ్ల నిండా నీళ్లు నిండి జలజలా జారాయి. ఆ నీళ్లు ఆమె కళ్లనుంచి కారుతున్నవి కాదని, అది ఆమె గుండెల్లో నుంచి పొంగి పొరలుతున్న సముద్రమని గ్రహించిన నా మనసు బరువెక్కింది. అప్రయత్నంగా ఓ అడుగు ముందుకేసి కన్నీటిని తుడిచి, ఆమెను గాఢంగా హృదయానికి హత్తుకున్నాను. కోరికతోకాదు... మనసుతో. మంచి మనసుతో..